ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 17 నవంబరు 2025





సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

అడ్డులేని గ్రావెల్ మాఫియా

'సబ్బవరం'లో యథేచ్ఛగా ప్రకృతి వనరుల దోపిడీ

- అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గ్రావెల్ తవ్వకాలు, రవాణా
- అధికార, విపక్ష నేతలు కుమ్మక్కు
- ఫిర్యాదు చేసే వారిపై భౌతిక దాడులు, బెదిరింపులు
- గ్రావెల్ రవాణా వాహనాలతో ధ్వంసమవుతున్న బీటీ రోడ్లు



గంగవరం రెవెన్యూ పరిధిలో పేదల ఇళ్ల కాలనీని ఆనుకొని గ్రావెల్ కోసం కొండను తొలిచేస్తున్న దృశ్యం



గ్రావెల్ రవాణా చేసే వాహనాల కారణంగా నంగినారపాడులో ఛిద్రమైన బీటీ రోడ్డు

సబ్బవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. అర్ధరాత్రి తరువాత నుంచి తెల్లవారుజాము వరకు గ్రావెల్ తవ్వి, తరలించుకుపోతున్నారు. కొండపోరంబోకు భూములు, పేదలకు ఇళ్ల కోసం వేసిన లేఅవుట్లను ఆనుకొని గ్రావెల్ దందా సాగిస్తున్నారు. అధికారంలో కూటమి నేతలు, ప్రతిపక్షంలో వున్న వైసీపీ నేతలు ఒక్కటైపోయి ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు.**

మండలంలో గంగవరం, నంగినారపాడు, పైడివాడ, పైడివాడఅగ్రహారం, అసకపల్లి, గాలిభీతమవరం, గొల్లలపాలెంలో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన లే-అవుట్లకు అనుకొని కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి పది గంటల తరువాత ఎక్స్‌కవేటర్ల రాక మొదలవుతుంది. తొలుత పెద్ద మొత్తంతో గ్రావెల్ తవ్వుతారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో టిప్పర్లు, లారీలు ఆయా ప్రదేశాలకు క్యూ కడతాయి. అప్పటికే తవ్విన గ్రావెల్‌ను ఈ వాహనాల్లోకి శరవేగంగా లోడింగ్ చేస్తారు. తెల్లవారుజామున ఐదు గంటల వరకు గ్రావెల్ తరలిస్తుంటారు. వాస్తవంగా ఇక్కడ గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ శాఖ ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అయినప్పటికీ అధికారులు ఎవరూ ఇటువైపు కన్నెత్తి అయినా చూడరు. అధికారులకు తెలిసే ఇదంతా జరుగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 'తిలా పాపం.. తలా పిడికెడు' అన్నట్టుగా గ్రావెల్ దందా మొత్తం చాపకింద నీరులా సాగిపోతున్నది.

ఫిర్యాదు చేసిన వారిపై దాడులు!

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై స్థానికులు ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే.. వారిపై దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వం సిబ్బందిని కూడా గ్రావెల్ మాఫియా లెక్కచేయడంలేదు. ఇటీవల

... మిగతా 6వ పేజీలో

విశాఖకు విశ్వఖ్యాతి

గూగుల్ రాకతో కంపెనీల ఏర్పాటుకు పలు దేశాల ఆసక్తి

- ప్రభుత్వ ఆహ్వానంతో సదస్సుకు హాజరైన ప్రతినిధులు
- డేటా సెంటర్ ఏర్పాటుకు రిలయన్స్ సంసిద్ధం
- పలు ఐటీ కంపెనీలకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): **సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సును విజయవంతంగా నిర్వహించడం ద్వారా విశాఖపట్నం పేరు అంతర్జాతీయంగా మార్మోగింది. రెండురోజుల సదస్సుకు 45 దేశాల నుంచి 640 మంది ప్రతినిధులు హాజరుకావడం సదస్సు ప్రాధాన్యతను తేటతెల్లం చేసింది. సదస్సులో పాల్గొన్న పారిశ్రామిక సంస్థలు విశాఖలో కంపెనీల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. కొందరు ఒప్పందాలు కూడా చేసుకున్నారు. ప్రసిద్ధ ఐటీ సంస్థ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖను ఎంపికచేసిన అనంతరం నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో అనేకమంది విశాఖ పేరును పదేపదే చెబుతూ ప్రశంసిస్తున్నారు.**

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖ ప్రాముఖ్యత ఏమిటో తెలుసుకునేందుకు పలుదేశాల ప్రముఖులు నగరానికి తరలివచ్చారు. భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పలు దేశాలలో రోడ్‌షోలు నిర్వహించి అక్కడ ప్రముఖులను కలిసి ఆహ్వానించారు. సీఎం అరబ్ దేశాలు, ఇంగ్లండ్, లోకేశ్ ఆస్ట్రేలియా, మరికొన్ని దేశాల్లో పర్యటించారు. ఏపీలో వనరులు, వసతులు, ప్రభుత్వ రాయితీలను వివరించడంతో వారంతా సదస్సుకు హాజరయ్యారు. అంతేకాకుండా గూగుల్ వంటి సంస్థ విశాఖను ఎంచుకోవడంతో నగరం ప్రాముఖ్యత తెలుసుకునేందుకు పలుదేశాల ప్రతినిధులు వచ్చారు. ఇక్కడి అతిథి మర్యాదలు, విశాఖలో సుందర దృశ్యాలు, వనరులు వారిని మంత్రముగ్ధులను చేశాయి. పెట్టుబడుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పలువురు కంపెనీ ప్రతినిధులు పరిశీలించి హామీలు ఇచ్చారు. పెట్టుబడులు కోసమే కాదని, నాలెడ్జిని ఇచ్చి పుచ్చుకోవడం, కొత్త ఆవిష్కరణలపై చర్చలు చేపట్టడంపై విశ్లేషణలకు సదస్సు వేదికగా మారిందని ప్రశంసించారు.

రిలయన్స్ డేటా సెంటర్

విశాఖలో గూగుల్ కంపెనీ ఒక గిగా వాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రకటన చేయడంతో ప్రపంచంలో అనేక కంపెనీల కన్ను విశాఖ వైపు పడింది. ఈ నేపథ్యంలో రిలయన్స్ సంస్థ ఒక గిగా వాట్ సామర్థ్యంతో విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించింది. దీనికితోడు మరో కంపెనీ కూడా డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. పలు ఐటీ కంపెనీలు విశాఖలో తమ శాఖలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. త్వరలో టీసీఎస్, కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఇన్ఫోసిస్ విశాఖ సెంటర్‌ను విస్తరించనున్నది. ఈ నెల 13వ తేదీన ఐటీ మంత్రి లోకేశ్ రుషికొండ ఐటీ సెజ్‌లో పలు కంపెనీలకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని కంపెనీలు నగరంలో తమ కార్యకలాపాలు నిర్వహిేందుకు ఆసక్తి చూపాయి. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు లోకేశ్ శంకుస్థాపనచేశారు.

పర్యాటక రంగానికి ఊతం

జలవిహార్ గ్రూప్ మధురవాడలో టూరిజం పార్కు ఏర్పాటు చేయనుంది. సన్ ఇన్‌స్టిట్యూట్ రూ.150 కోట్లతో బీచ్‌రోడ్డులో హోటల్ నిర్మించనున్నది. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని సంస్థలు ఉత్సాహం చూపిస్తున్నాయి. క్రూయిజ్ వ్యాపార విస్తరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖ నుంచి చెన్నై వరకు నడుపుతున్న సీ క్రూయిజ్ ఫ్రీక్వెన్సీ పెంచేందుకు నిర్ణయించారు. విశాఖ శివారున హిందూజా గ్రూప్ థర్మల్‌ప్లాంట్‌ను విస్తరించనుంది. నక్కపల్లి సమీపంలో స్టీల్ సిటీ రానున్నది. పరవాడ, అచ్యుతాపురం ఫార్మాసిటీలలో పలు ఔషధ కంపెనీలు కొత్త యూనిట్లు ఏర్పాటుచేస్తున్నాయి. భాగస్వామ్య సదస్సు నిర్వహణ ద్వారా విశాఖలో పెట్టుబడులకు అవకాశాలు పెరిగాయని పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఇది నగరాభివృద్ధికి దోహదపడడంతో పాటు ఉత్తరాంధ్ర పరిధిలోని యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని చెబుతున్నారు.



సీఐఐ పెట్టుబడిదారుల సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, గవర్నర్, సీఎం, మంత్రులు (ఫైల్)

'విశాఖ కొత్త నగరంగా, ఏఐ సిటీగా ఎదుగుతుంది. ఇక్కడి ఎకో సిస్టమ్ భవిష్యత్తు తరానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. టీసీఎస్‌కు దేశ నిర్మాణం ముఖ్యం. విశాఖలో పెట్టుబడులు పెట్టడం మా మనసుకు దగ్గరైన విషయం. ఇది అభివృద్ధి చెందుతున్న నగరం. అందరినీ కలుపుకుని పోయే విధానానికి మేము అనుకూలం.. అందుకే ఈ ప్రాంతం అభివృద్ధి ముఖ్యమైనది. పెట్టుబడి పెట్టడానికి కారణం కేవలం వ్యాపారమే కాదు.. నగరానికి ఉన్న సానుకూల దృక్పథం ఒక కారణం. విశాఖలో నైపుణ్యతకు కొదవలేదు. సకాలంలో ప్రాజెక్టుపూర్తిచేసి డెలివరీ చేయాలన్న పట్టుదల ఉంది. అది మమ్మల్ని ఆకట్టుకుంది'.



- శ్రీధరన్ వెంకటరామన్, టీసీఎస్ కీలక ప్రతినిధి

అనకాపల్లి, రాజమండ్రిలో పీసీబీ ఆఫీసులు

- విశాఖలో చీఫ్ ఇంజనీరు కార్యాలయం
- కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య



రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించడం, నాణ్యమైన సేవలు అందించడం, సకాలంలో సమర్థంగా పనిచేసే దిశగా ప్రతి జిల్లాలో కార్యాలయాలు ఏర్పాటుచేస్తున్నట్టు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య తెలిపారు. ఇందులో భాగంగా అనకాపల్లి, రాజమండ్రిలో కార్యాలయాల ఏర్పాటుకు బోర్డు, ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. పరిశ్రమల పర్యవేక్షణ, తనిఖీలు, ప్రమాదాలు జరిగినపుడు వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరివరకు ఫార్మా, ఇతర పరిశ్రమలకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా విశాఖపట్నంలో చీఫ్ ఇంజనీరు ఉండాలని అభిప్రాయపడ్డారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా చాలా శాఖలకు జిల్లా స్థాయి అధికారులను నియమించారని, కాలుష్య నియంత్రణమండలి ఈఈ కేడర్‌లో కార్యాలయం ఉండాలన్నారు. మండలిల సంస్కరణలు అమలుచేశామన్నారు. బోర్డుకు అధికారుల కొరత ఉందని, చీఫ్ ఇంజనీరు నుంచి నాలుగు జోన్‌లకు జాయింట్ చీఫ్‌ఇంజనీరు పోస్టులు,ఎస్‌ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నామనానరు. ఇటీవల 21 ఏఈ పోస్టులు భర్తీ చేశామని, త్వరలో జిల్లాలకు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్న తరుణంలో కాలుష్యనియంత్రణమండలి పాత్ర కీలకమన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు అనుమతుల కోసం పారిశ్రామికవేత్తలు/వారి ప్రతినిధి జిల్లాల్లోని పీసీబీ కార్యాలయాల చుట్టూ తిరగకుండా మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖపట్నంలో కాలుష్యనిర్ధారణ కోసం ప్రస్తుతం ఒక ఆన్‌లైన్ యాంబియంట్ ఎయిర్‌క్వాలిటీ యంత్రం ఉందని, మరో రెండు మూడు యంత్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.

బాలికల హాస్టల్ రెడీ



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బాలికల హాస్టల్ భవనం

నక్కపల్లిలో సకల సదుపాయాలతో నిర్మాణం

- హైస్కూల్ విద్యార్థినులకు వసతి
- త్వరలో ప్రారంభోత్సవం

నక్కపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో సకల సదుపాయాలతో బాలికల హాస్టల్ భవనం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇక్కడి ఉన్నత పాఠశాలల్లో చదువుకుం టున్న ఇతర గ్రామాలకు చెందిన బాలికలకు వసతి కల్పించేందుకు నిర్మించిన ఈ హాస్టల్‌ను త్వరలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2022 జనవరి 30న అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇక్కడ బాలికల వసతి గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆర్ఎంఎస్ఏ నిధులు రూ2.05 కోట్లతో చేపట్టిన పనులు ఏడాది తిరిగే సరికి ఆగిపోయాయి. అప్పట్లో రెండు అంతస్థులకు శ్లాబ్‌లు వేసి వదిలేశారు. వాస్తవంగా 2023 జూన్‌నాటికి పనులు పూర్తిచేసి, భవనాన్ని అందుబాటులోకి తేవాలి. కానీ బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం కారణంగా కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవన నిర్మాణ పనులు పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టారు. దీంతో పనులు చురుగ్గా జరిగి, దాదాపు పూర్తయ్యాయి. బాలికల భద్రత, రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ రెండు అంతస్తుల్లో మొత్తం 25 గదులను నిర్మించారు. ఇందులో 150 మందికిపైగా విద్యార్థినులకు వసతి కల్పించవచ్చు. భోజనశాల, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు వున్నాయి. నక్కపల్లి నుంచి ఉపమాక వెళ్లే రహదారికి ఆనుకుని నిర్మించిన ఈ హాస్టల్‌లో నక్కపల్లిలోని గర్ల్స్ హైస్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఇతర గ్రామాలకు చెందిన నిరుపేద కుటుంబాల విద్యార్థినులకు వసతి కల్పిస్తారు. హోం మంత్రి అనిత త్వరలో ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు.



హాస్టల్‌లో అధునాతన వసతులు..

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- ప్రజల్లో చైతన్యానికి పోలీసు శాఖ 'అభ్యుదయ' యాత్ర
- రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



వడ్డాదిలో నిర్వహించిన ర్యాలీలో డీఐజీ గోపీనాథ్ జట్టి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 'అభ్యుదయం' పేరుతో పోలీసు శాఖ చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం సాయంత్రం వడ్డాది చేరుకుంది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, తెలిసీతెలియని వయసుల్లో విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం గమనిస్తూ, చెడు అలవాట్ల దరికి చేరకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి బుచెయ్యపేట పోలీసులను ఆదేశించారు.ఆదివారం ఆయన పోలీసుస్టేషన్‌ను

... మిగతా 6వ పేజీలో

పర్యాటకుల సందడి

- మన్యంలో సందర్శనీయ ప్రాంతాలు రద్దీ
- పిక్నిక్ సీజన్ కావడంతో మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో వచ్చిన పర్యాటకులు



లంబసింగి సమీపంలోని చెరువులవేనంలో పర్యాటకులు

పాడేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మన్యంలోని సందర్శనీయ ప్రదేశాలకు పర్యాటకులు పోటెత్తారు. కార్తీక మాసం కావడంతో పిక్నిక్‌ల సందడి నెలకొంది. ఆదివారం ఏజెన్సీలో ఎక్కడ చూసినా పర్యాటకులే కనిపించారు. అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలంలోని లంబసింగి వరకు సందడి మొదలైంది. పర్యాటకుల్లో అత్యధికులు మైదాన ప్రాంతానికి చెందిన వారు కావడం విశేషం. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటిక, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, గిరి గ్రామదర్శిని, ఆయా ప్రాంతాల్లోని వలిసె పూల తోటలు, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి గెడ్డ, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువువేనం మేఘాల కొండ, లంబసింగి, యర్రవరం జలపాతం తదితర ప్రాంతాలను పర్యాటకులు సందర్శించారు.



రేవుపోలవరం సముద్రతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

రేవుపోలవరానికి పోటెత్తిన పర్యాటకులు

ఎస్.రాయవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్రతీరానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కార్తీక మాసం కావడంతోపాటు ఇక్కడ సముద్రతీరం ఎంతో ఆహ్లాదకరంగా ఉండడంతో పిక్నిక్‌లు జరుపుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సముద్రం నీటిలో దిగి ఉల్లాసంగా గడిపారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ఎంజాయ్ చేశారు. మధ్యాహ్నం సమీపంలోని కొబ్బరి తోటల్లో వన భోజనాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్‌తో నిఘా పెట్టి పర్యవేక్షించారు. మైరైన్ పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు గస్తీ నిర్వహించారు.

ఘనంగా ముసిలితల్లి అమ్మవారి పండుగ



సంప్రదాయబద్ధంగా అమ్మవారి ఊరేగింపు

మునగపాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో అరబుపాలెం గ్రామంలో ముసిలితల్లి అమ్మవారి పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. సంప్రదాయబద్ధంగా అమ్మవారి పండుగ ఊరేగింపు పురవీధుల్లో నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పంబా అన్నదానానికి విరాళం

నక్కపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే భక్తుల కోసం పంబా వద్ద జరుగుతున్న నిత్య అన్నదానం కోసం నక్కపల్లిలో దీక్షా పీఠం సభ్యులంతా 2 టన్నుల బియ్యాన్ని సమకూర్చారు. ఆదివారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ ద్వారా అయ్యప్ప, శివయ్య దీక్షాపరులంతా రెండు టన్నుల బియ్యాన్ని చంటి గురుస్వామికి అందజేశారు. కార్యక్రమంలో దీక్షాపరులు గణేశ్, వీసం శ్రీను ,బంగార్రాజు, పోలినాటి వీరబాబు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు యూనిఫారం వితరణ



దివ్యాంగ విద్యార్థులకు యూనిఫారమ్ అందజేసిన దృశ్యం

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ, స్టీల్‌ప్లాంట్ పూర్వపు డైరెక్టర్ కేఎస్‌రావు ఏకరూపు దుస్తులను ఆదివారం అందజేశారు. సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా దుస్తులను వితరణ చేసినట్టు దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకులు పీఎస్‌టీ పట్నాయక్ తెలిపారు.

క్షతగాత్రుడికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని చోడపల్లి జంగాల కాలనీకి చెందిన టి.ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రసాద్ నిరుపేద కావడంతో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలకు చెందిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు రూ.15 వేలు చెక్కుని క్షతగాత్రుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో పుల్రే రవిచంద్ర యాదవ్, ఎరిపల్లి ముత్యాలు, ఆడాడ చిన్న, వసాది ఉదయ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో 'పేట' విద్యార్థిని ప్రతిభ



బొబ్బర లేఖ్య

పాయకరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో పాయకరావుపేటకు చెందిన బొబ్బర లేఖ్య అద్భుత ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించింది. ఆమెకు త్వరలో పుట్టపర్తిలో జరిగే కార్యక్రమంలో బంగారు పతకం అందజేస్తారని సత్యసాయి భజన మండలి కన్వీనర్ పి.రమేష్‌బాబు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, విద్యా విభాగం ఇన్‌చార్జి సత్యమూర్తి, భజన మండలి సభ్యులు యజ్ఞవల్క్యశర్మ, సాయికుమార్, రమణరాజు, సుబ్బారావు, లక్ష్మీపతిరాజు అభినందనలు తెలిపారు.

'శ్రీప్రకాష్' విద్యార్థినుల 'స్పైస్' సందడి

పాయకరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ క్రియేటివ్ ఎనర్జీస్ (స్పైస్) పేరిట సందడి చేశారు. విద్యా సంస్థల ఆవరణలో శని, ఆదివారాలు నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్.భానుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు తమ దైనందిన కార్యక్రమాలకు భిన్నంగా ఆటపాటలతో గడపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అకడమిక్ ఇన్‌చార్జి డి.శ్రీలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మునగపాకలో అయ్యప్పస్వామి అంబలం పూజ



నేత్రానందంగా జరుగుతున్న అయ్యప్ప అంబలం పూజ

మునగపాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన అంబలం పూజ అంబరాన్నంటింది. ప్రతి సంవత్సరం శబరిమలలో దర్శనం ప్రారంభం రోజునే ఇక్కడ అంబలం పూజ నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. దానిలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన అంబలం పూజకు మండలం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి అయ్యప్ప మాలధారణ భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అంబలం పూజలో భాగంగా ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగులు, బంతిపూల తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

తుపాకు గెడ్డ పొర్లుకట్టుపై నాచు

- జారిపోతున్న పాదచారులు
- ఇటీవల ఇద్దరికి విరిగిన కాళ్లు
- బోల్తా పడుతున్న వాహనాలు
- పొర్లుకట్ట వద్ద కల్వర్టు నిర్మించాలని వేడుకోలు
- హోంమంత్రి అనిత చర్యలు తీసుకోవాలని

రాట్నాలపాలెం వాసుల వినతి



కోటవురట్ల తుపాకు గెడ్డ పొర్లుకట్టుపై నాచు పట్టిన దృశ్యం

కోటవురట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాట్నాలపాలెం నుంచి కోటవురట్ల సంతబయిలుకు వెళ్లే దారిలో తుపాకు గెడ్డపై నిర్మించిన పొర్లుకట్టు నాచు పట్టడంతో వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. లింగాపురం ఊర కొండ నుంచి వస్తున్న తుపాకు గెడ్డ నీరు కోటవురట్ల జంక్షన్ మీదుగా వరహా నదిలో కలుస్తున్నది. అయితే తుపాకు గెడ్డ నీరు పోయేందుకు రజకులపేట వద్ద పొర్లుకట్టు నిర్మించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గెడ్డలో నీరు నిరంతరం పారుతున్నది. రాట్నాలపాలెం నుంచి ప్రతి రోజూ 40 మంది విద్యార్థులు సంతబయిలు జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో చదువుకునేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే పంట పొలాల్లో పనిచేసే కూలీలు, పలువురు ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగుతున్నారు. అయితే పొర్లుగట్టు పైనుంచి నీరు పారుతుండడంతో నాచు పట్టింది. దీంతో పాదచారులు జారిపోతున్నారు. వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. కోటవురట్లకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆ ప్రదేశంలో పడిపోవడంతో కాళ్లు విరిగిపోయాయి. రోజూ నడిచి వెళ్లే విద్యార్థులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అదే పరిస్థితి వీరికి కూడా వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పొర్లుకట్ట వద్ద కల్వర్టు నిర్మించాలని గ్రామస్థులు అంటున్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే, హోంమంత్రి వంగలపూడి అనిత కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, సమస్యను పరిష్కారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి యువత నడుం బిగించాలి

- ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి యువత నడుంబిగించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. ఆదివారం పూడిమడకలో నిర్వహించిన 'నేను.. నాయువత' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత పూనుకొంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. యువత ముందుగా ప్రజాసేవ చేయాలన్న చిత్తశుద్ధి అలవరచుకోవాలన్నారు. కర్మాగారాలు ఏర్పాటుకు యువత సహకరించాలని, తాను యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి తప్పనిసరిగా కృషిచేస్తానన్నారు. ముఖ్యంగా పూడిమడక యువకులు కోపం తగ్గించుకొని శాంతంగా ఉంటే తప్పనిసరిగా ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. చెప్పుడు మాటలు విని చెడదోవలు పడితే యువత నిర్వీర్యం అయిపోతుందన్నారు.

ఈసందర్భంగా మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు గజమాలతో విజయకుమార్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేరుగు వెంకటరావు ప్రవీణ్, కాసుబాబు, కిరణ్, సమ్మింగా లక్ష్మణ, ఉమ్మిడి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



అప్పలనాయుడు (ఫైల్)

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడని సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం రాత్రి పది గంటల ప్రాంతంలో రాజాన అప్పలనాయుడు స్కూటీపై హరిపాలెం నుంచి నాయనమ్మపాలెం వస్తున్నాడని, అచ్యుతాపురం జంక్షన్‌కి వచ్చేసరికి అనకాపల్లి వెళ్తున్న లారీ ఢీకొందన్నారు. లారీ డ్రైవర్ ముందు వెళ్తున్న మరో లారీని ఓవర్‌టేక్ చేసే సమయంలో స్కూటీని ఢీకొందన్నారు. దీంతో అప్పలనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుక



శనివారం రాత్రి జరిపించిన స్వామి కల్యాణం

ఎస్.రాయవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచి చేపట్టిన స్వామి కల్యాణ మహోత్సవ ముగింపు వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వీరబ్రహేంద్రస్వామి పూజలు చేశారు. వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు స్వామిని దర్శించుకున్నారు. తర్వాత నిర్వహించిన అన్నసమారాధనలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత సోమిరెడ్డి రాజు, పులి సత్తిబాబు పాల్గొన్నారు.

సామాజిక వర్గాల కార్తీక వన సమారాధనల సందడి



పాయకరావుపేట: పలువురు నేతలకు సత్కారం



ఎస్.రాయవరం ప్రగడ నాగేశ్వరరావును సత్కారం



మునగపాక: పెద్దలకు సత్కారం

పాయకరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేటలో ఆదివారం పలు సామాజిక వర్గాలు కార్తీక వన సమారాధనలు నిర్వహించడంతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమాలకు ఆయా వర్గాలు కుటుంబాలతో సహా తరలివచ్చి ఆటపాటలు, సమావేశాలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. స్థానిక లక్ష్మీనగర్ పార్కులో లక్ష్మీనారాయణ వాకర్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు తోట నగేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, జిల్లా గొర్రెల రాజబాబు, ధనిశెట్టి బాబూరావు, గూటూరు శ్రీనివాసరావులను సత్కరించారు. కార్యక్రమంలో నాతవరం తహశీల్దారు ఆడపా వేణు, టీడీపీ నాయకులు దేవవరపు ఆనంద్, గొల్లపల్లి నాగు, వాకర్స్ క్లబ్ సభ్యులు చించలపు సత్యనారాయణ, పెదిరెడ్డి తాను, కాళ్ల కృష్ణ, రమణ, వీరబాబు, వికాస తరంగిణి సభ్యులు చిక్కాల శ్రీనివాసరావు, యు.శ్రీనివాసవర్మ, పి.చంద్రరావు, జి.వరలక్ష్మి పాల్గొన్నారు. అదేవిధంగా కురుమళ్ళ లేఅవుట్‌లో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. పట్టణంలోని వై.జంక్షన్ వద్ద జగతావారి తోటలో మండల దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది.

ఘనంగా ప్రగడ కుటుంబ సభ్యుల సమ్మేళనం

ఎస్.రాయవరం: రాష్ట్రంలోని ప్రగడ ఇంటి పేరు గల ఒకే సామాజిక వర్గానికి చెందిన కుటుంబ సభ్యులంతా ఒకేచోట కలవడం అభినందనీయమని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో ఏర్పాటుచేసిన ప్రగడ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ఏడాది నాతవరం మండలం ధారగంగవరానికి చెందిన ప్రగడ కృష్ణబాబు, కన్నబాబుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనంలో ఎలమంచిలి, ఎస్.రాయవరం,అచ్యుతాపురం, విశాఖపట్నం, రాజమండ్రి, తణుకు, కాకినాడ, తుని, తదితర పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వారంతా ఆటపాటలతో సరదాగా గడిపారు. మధ్యాహ్నం వనభోజనం చేశారు. కార్యక్రమంలో ప్రగడ కుటుంబ సభ్యులు జగన్నాథరావు, దుర్గాప్రసాద్, తులసి, శేషు, దుర్గారావు, రమేష్ పాల్గొన్నారు.

'ఆడారి' ఆత్మీయ సమారాధన

మునగపాక: మునగపాకలో గవర సామాజిక వర్గానికి చెందిన ఆడారి కుటుంబీకుల ఆత్మీయ సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని వారంతా స్థానిక బైపాస్‌రోడ్డుకు సమీపంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరుపుకున్నారు. పెద్దలను శాలువతో సత్కరించి, వారి ఆశీస్సులను కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అనంతరం ఆడారి వారి ఆత్మీయ సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా ఆడారి కాశిబాబు, కార్యదర్శిగా ఆడారి బాపునాయుడు, ఉపాధ్యక్షుడుగా పరశురాం, సహాయ కార్యదర్శిగా జగన్నాథరావు, కోశాధికారిగా ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

గ్రంథాలయ పితామహులకు ఘన నివాళి



ఎలమంచిలిలో గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వక్తలు



అచ్యుతాపురంలో ఉద్యమ నేతలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎలమంచిలిలో గ్రంథాలయాల పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్‌ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.ఆనంద్, ఉపాధ్యాయులు మళ్ల రామునాయుడు, ఎస్‌కే అబ్దుల్లా, శేఖరమంత్రి నరసింగరావు, ఎం.సత్యనారాయణ, కె.దుర్గారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

స్థానిక గ్రంథాలయంలో ఉద్యమ నేతల సంస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్యమ నేతలైన అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి ఎల్వీ రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

పాయకరావుపేటలో..

స్థానిక వైఎస్‌ఆర్. శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను పలువురు నాయకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, పాఠకులు తిలకించారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరి, టీడీపీ నేతలు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీవిశ్వనాథం, గొర్రెల రాజబాబు, గూటూరు శ్రీను, మజ్జూరి నారాయణరావు, ఉపాధ్యాయులు ఎస్‌వీఎస్. ఆచార్యులు, వైసీపీ నేత జగతా శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పద్య పఠనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

గ్రంథాలయాల్లో వున్న జనరల్ నాలెడ్జ్, చరిత్ర, తదితర పుస్తకాలను విద్యార్థులు చదవాలని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వి.బాలాజీ అన్నారు. ఈ గ్రామ శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.జనార్దన్, బీజేపీ నాయకుడు గట్టెం నానాజీ పాల్గొన్నారు.

మునగపాకలో..

గవర్లఅనకాపల్లిలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకుడు ఆళ్ల మహేశ్వరరావు ఆధ్వర్యంలో వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠంగా జరిగాయి. మునగపాక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.వరలక్ష్మి పర్యవేక్షణలో పర్యావరణంపై ప్లాస్టిక్ ప్రభావం అంశంపై సీనియర్, జూనియర్ విభాగాలుగా జరిగిన వ్యాసరచన పోటీల్లో మునగపాక జెడ్పీ, నారాయణ, ప్రియదర్శిని, ప్రణతి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ ఉద్యమకర్తలు ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావులకు నివాళులర్పించారు. గణపర్తి శాఖాగ్రంథాలయంలో వేడుకలు జరిగాయి.

రాంబిల్లిలో..

గ్రంథాలయాలను నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దిమిలి గ్రంథాలయం అధికారిణి శకుంతల అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం దిమిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో రావి, మర్రి, వేప వృక్షాలకు హోమం



కొత్తపాలెంలో రావి, వేప, మర్రి వృక్షాల వద్ద హోమం చేస్తున్న గ్రామస్థులు

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఆదివారం మునిసిపాలిటీ కొత్తపాలెం గ్రామంలో వేప, మర్రి, రావి వృక్షాలకు భక్తిశ్రద్ధలతో హోమం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులంతా దేవతా వృక్షాలకు పసుపు, కుంకుమలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా దేవతా వృక్షాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గోమాతలను పూజించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలి : సీఐటీయూ

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దిబ్బపాలెం పునరావాస కాలనీలో భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. ఆదివారం దిబ్బపాలెంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలన్నీ సెజ్‌లో కర్మాగారాలకు దిబ్బపాలెం మీదుగా వెళ్తున్నాయని, దీనివల్ల రోడ్లు పాడైపోయాయన్నారు. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉందన్నారు. అందువల్ల పునరావాస కాలనీగుండా భారీ వాహనాలు రాకుండా నిషేధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమలో కూండ్రపు సోమునాయుడు, లాలం సంజీవి, బుల్లిదొర, జి రమేష్, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో అన్నదానం



ఏటికొప్పాకలో అన్నదానానికి తరలివచ్చిన భక్తులు

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో బండిమాంబ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమరాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'తొలగించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తిరిగి ఏర్పాటు చేయాలి'

పాయకరావుపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరట్లకోట గ్రామ పరిధిలోని లేఅవుట్‌లో తొలగించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ని తిరిగి ఏర్పాటు చేయాలని లేఅవుట్‌లో స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థలాల యజమానులు నడిగట్ల ప్రసాద్, మత్సుర్తి భార్గవ్‌కిరణ్, మామిడి గణేష్, గండేపల్లి సత్యనారాయణ, పోసిన బుజ్జి తదితరులు మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం లేఅవుట్ డెవలపర్ చిక్కాల శ్రీనివాసరావు సొంత నిధులు రూ.6 లక్షలు ఖర్చు చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారన్నారు. లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకున్న ఇద్దరికి విద్యుత్ కనెక్షన్లు కూడా ఇచ్చారన్నారు. అయితే వీరు విద్యుత్ బిల్లులు చెల్లించలేదని కనెక్షన్లు తొలగించిన విద్యుత్ అధికారులు ఎటువంటి సమాచారం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ని కూడా తొలగించారన్నారు. దీనిపై లేఅవుట్ డెవలపర్ చిక్కాల శ్రీనివాసరావు విద్యుత్ శాఖ అధికారులను నిలదీయగా అవసరమైనపుడు తిరిగి ఏర్పాటుచేస్తామని చెప్పారన్నారు. దీనిపై ఈపీడీసీఎల్ డీఈఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. లేఅవుట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వినియోగంలో లేకపోవడంతో తొలగించామ న్నారు. లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకునేవారికి అవసరమైతే తిరిగి దరఖాస్తు చేసుకుని, ఫీజులు చెల్లిస్తే పెడతామన్నారు.

అడ్డులేని గ్రావెల్ మాఫియా



అంతకాపల్లిలో ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

అర్ధరాత్రి గ్రావెల్ తవ్వకాలు జరుపుతుండగా అధికారులు దాడి చేస్తున్నారన్న సమాచారంతో అక్రమార్కులు పారిపోయే క్రమంలో ఒక గొర్రెల కాపరని ఎక్సకవేటర్‌తో ఢీకొన్నారు. అనంతరం అధికారులు, రాజకీయ నాయకులు మధ్యవర్తిత్వం చేసి పోలీసు కేసు లేకుండా సెటిల్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. గతంలో గ్రావెల్ తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఒక వీఆర్వోపైకి ఎక్స్‌కవేటర్‌తో దాడికి యత్నించగా, అతను త్రుటిలో తప్పించుకున్నాడు. కానీ ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయ్యింది. స్థానిక నాయకులు మధ్యవర్తిత్వం చేసి వీఆర్వోకు కొత్తబైక్ కొనిచ్చి కేసు లేకుండా చేశారు. అధికార, విపక్ష నేతలు ఒక్కటై గ్రావెల్ దందా సాగిస్తుండడంతో అధికారులు పట్టించుకోవడంలేదు.

గ్రావెల్ వాహనాలతో బీటీ రోడ్లు ధ్వంసం

మండలంలోని గంగవరం, నంగినారపాడు గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రతిఫలంగా వీఎంఆర్‌డీఏ అధికారులు కొన్ని ప్లాట్లు ఇచ్చారు. ఈ లేఅవుట్లలో తొలుత గ్రావెల్ రోడ్లు, అనంతరం బీటీ రోడ్లు వేశారు. గ్రావెల్ తరలించే వాహనాలు ఈ రోడ్ల మీదుగా వెళుతుండడంతో ఛిద్రమవుతున్నాయి. వీఎంఆర్‌డీఏ అధికారులు సైతం పట్టించుకోవడంలేదు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తులో పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కఠినంగా అమలు చేయాలని, వాహనచోదకులు సీటు బెల్ట్/హెల్మెట్ వాడకం నిబంధలను కచ్చితంగా పాటించేలా చూడాలన్నారు. వివిధ రూట్లలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ మండలం మీదుగా గంజాయి రవాణాను పూర్తిగా కట్టడి చేయాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు వీటి బారిన పడకుండా వుండేందుకు గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, మహిళా చట్టాలు, హెల్ప్‌లైన్ వినియోగంపై గ్రామాల్లో ప్రచారం చేయాలని అన్నారు. డీఐజీ వెంట ఎస్‌ఐలు ఎ.శ్రీనివాసరావు, రఘువర్మ, నారాయణరావు, పోలీసు సిబ్బంది వున్నారు.

నూకాంబిక ఆలయం కళకళ

- వేకువజామున విశేష పూజల అనంతరం దర్శనాలు
- వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాక


బాలాలయంలో అమ్మ

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత ఇక్కడి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనాలు కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. కుటుంబాలతో విచ్చేసినవారు ఆలయ పరిసరాల్లో వంట వండుకుని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటు వంటి అసౌకర్యం లేకుండా అధికారులు, పాలకవర్గం తగిన చర్యలు తీసుకున్నారు.


అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఘనంగా అయ్యప్పస్వామి అంబలం పూజ

సబ్బవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెదగొల్లలపాలెంలో అయ్యప్ప అంబలం పూజను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మండపాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. గురుస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించగా, శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములతో పాటు, భవానీ, శివ మాలలు ధరించిన భక్తులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో ఉత్సాహంగా చదరంగం పోటీలు


చదరంగం ఆడుతున్న విద్యార్థులు

కశింకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదరంగం, క్విజ్ పోటీలను నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు సుమారు 75 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. వీరికి ఈ నెల 20న జరగనున్న ముగింపు సభలో బహుమతి ప్రదానం చేస్తామని గ్రంథాలయాధికారి కె.జగన్నాథం తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి జి.మురళీకృష్ణ, జడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ యం.వి.కె.హరినాథ్, అంబేడ్కర్ గురుకులం పాఠశాల ఉపాధ్యాయిని నూకరత్నం పాల్గొన్నారు.

పరవాడలో దోబీఘాట్లు ఏర్పాటుకు శ్రీకారం


దోభీఘాట్ నిర్మాణానికి శంకుస్థాపనలో సర్పంచ్ అప్పలనాయుడు, తదితరులు

పరవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ పెదచెరువు దిగువ భాగంలో దోబీఘాట్ల నిర్మాణానికి సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ఆదివారం శంకు స్థాపన చేశారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ 8 లక్షలతో రజకులకు ఉపయోగపడే విధంగా దోబిఘాట్లును ఏర్పాటు చేయడం జరుగతాదన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసేలా చూడాలని ఈసందర్భంగా సర్పంచ్ ఎన్టీపీసీ అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు రెడ్డి శ్రీనిసరావు, పైలా రామచంద్రరరావు, బొద్దపు అయ్యబాబు, సిరపరపు రాజేశ్, బండారు రాజు, చొప్ప సతీశ్, రాంబాబు, రజక సంఘం ప్రతినిధులు వాడపర్తి విశేశ్వరరావు, గునూరు రవి, నాగరాజు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు

లంకెలపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. లంకెలపాలెంతో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం చేపట్టిన వీధిలైట్ల నిర్వహణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో దశల వారీగా వీధి లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎక్కడైనా వీధి లైట్లు లేకపోతే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యర్రా కోటేశ్వరరావు, దాసరి రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొనారు.

హస్తినాపురంలో హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం

పరవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం శివారు హస్తినాపురంలో ఆదివారం హెరిటేజ్ డెయిరీ నూతన పాల సేకరణ కేంద్రం ఏర్పాటైంది. దీనిని సంస్థ మేనేజర్ కూండ్రపు శేషు ప్రారంభించారు. హెరిటేజ్ డెయిరీలో పాలుపోసే పాడి రైతులకు డెయిరీ ద్వారా అందించే సేవలను వివరించారు. పాలు పోసే ప్రతి రైతుకు రూ.50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతు ప్రమాదంలో మృతి చెందితే రూ. రెండు లక్షల బీమా, సహజ మరణానికి రూ 50 వేలు చొప్పున రైతుకు అందజేయడం జరుగుతాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కె.అనంతరావు, సోమునాయుడు, సీహెచ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆటో ఢీకొన్న ప్రమాదంలో గాయాలకు గురైన వ్యక్తి ఆదివా రం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ శేఖర్ తెలి పిన వివరాలివి. అనకాపల్లి పట్టణంలోని చోడవరం బస్టాప్ సమీపంలో విజయరామరాజుపేట శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన మంజేటి ఈశ్వరమ్మ, రమణ (50) భార్యాభర్త ఇద్దరూ ఈ నెల తొమ్మిదో తేదీ రాత్రి నిల్చొని ఉన్నారు. వీరిని ఆటో ఢీకొనడంతో రమణ తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

నీరు తరిగిపోయె.. చెత్త పెరిగిపోయె..

- చాలా చోట్ల స్వరూపం మారుతున్న చెరువులు
- ఇష్టారాజ్యంగా వ్యర్థాల పారబోత
- సబ్బవరం మండలంలో డింపింగ్ యార్డుల్లా దర్శనం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

చెరువులు.. ఒకప్పుడు ప్రజల గొంతు తడిపేవి. పంట పొలాలకు పుష్కలంగా నీరందించేవి. కానీ ప్రస్తుతం చాలా వరకు వీటి స్వరూపం మారిపోయింది. కొన్ని చోట్ల ఆక్రమణలకు గురై కుంచించుకుపోతుండగా, మరికొన్నిచోట్ల వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఫలితంగా ఆయకట్టు రైతులు అయోమయానికి గురవుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తున్నా.. పొలాలకు నీరు సరిగా అందక దిగుబడులు రాక దిగాలు చెందుతున్నారు. సబ్బవరం మండలంలో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి.


సబ్బవరం- చోడవరం రోడ్డుకు ఆనుకొని ఉన్న చింతల చెరువు డంపింగ్ యార్డును తలపిస్తున్న దృశ్యం

సబ్బవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొటివాడ రెవెన్యూ పరిధిలో గల చింతల చెరువు డంపింగ్ యార్డును తలపిస్తుంది. సబ్బవరం-చోడవరం ప్రధాన రహదారిలో ఈ చెరువు ఉండడంతో వివిధ గ్రామాల నుంచి వ్యర్థాలను తెచ్చి ఇక్కడ డంప్ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో ఏడాది కాలంగా ఈ చెరువు డంపింగ్ యార్డును తలపిస్తుంది. రెస్టారెంట్లు, కల్యాణ మండపాలు తదితరాల్లో మిగిలిపోయిన వ్యర్థాలను సైతం ఇక్కడ పారబోస్తున్నారు.

అదే విధంగా కోళ్లఫారాలలో చనిపో యిన కోళ్లను, చికెన్ షాపుల్లో కోళ్ల వ్యర్థాలను ఆటోలు, వ్యాన్ల ద్వారా తెచ్చి మరీ చెరువులో పారబోస్తున్నారు. ఈ చెరువు ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చి చెత్తాచెదారాన్ని వేసేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఇటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు పట్టించుకోకుంటే ముందుందు పరిస్థితులు మరింత దారుణంగా ఉంటాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే ఈ పరిధిలోని ఆయకట్టు బీడుగా మారే ప్రమాదం ఉందని ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు.

చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి

మండలంలోని మలునాయుడుపాలెంలో మావూళ్ల చెరువు ఉంది. దీని గర్భం సుమారు అరవై ఎకరాలు కాగా, ఆయకట్టు రెండు వందల ఎకరాల్లో ఉంటుంది. ఈ చెరువు పాతరోడ్డు- గుల్లేపల్లి రోడ్డుకు ఆనుకుని ఉండడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, కోళ్ల వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. అలాగే, పినగాడి- కె.కోటపాడు రోడ్డులో గల మొగలిపురం, మలునాయుడుపాలెం వద్ద ఉన్న మల్లోడి చెరువుదీ ఇదే పరిస్థితి. వంగలి- నాయనమ్మపాలెం రోడ్డులో ఉన్న చెరువులో కూడా గ్రామాల నుంచి చెత్తాచెదారాన్ని తెచ్చి వేస్తున్నారు. అదేవిధంగా సబ్బవరం, సాయినగర్ కాలనీ నుంచి దేవుడు చెరువుకు వరద నీరు పారే గెడ్డను సైతం చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపేస్తున్నారు. గొల్లలపాలెం గ్రామానికి ఆనుకొని, సచివాలయానికి ఆనుకొని ఉన్న గెడ్డ చెత్తతో పూడికపోయి ఉంది. ఇలా పలు గ్రామాల్లో చెరువుల పరిస్థితి ఉండడంతో అయా పరిధిలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చెత్తాచెదారం పాటోయడం వల్ల తలెత్తే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించడంతో పాటు పూడికలను తొలగించే ఏర్పాట్లు చేపట్టాలని అంతా కోరుతున్నారు.


మలునాయుడుపాలెంలోని మావూళ్ల చెరువు దుస్థితి

పడమటమ్మ, భూలోకమ్మకు సారె సమర్పణ


భూలోకమ్మకు సారె తీసుకు వెళుతున్న భక్తులు


కశింకోట గ్రామ పురవీధుల్లో పడమటమ్మ తల్లి సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కశింకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో పడమటమ్మతల్లి నవ రాత్రి సంబరాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సారె మహోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన లడ్డూలు, అరిసెలు, సున్నుండలు, చలిమిడి తదితరాలతో పాటు వివిధ రకాల ఫలాలను భారీ ఎత్తున ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అంతకుముందు వేకువజాము నుంచి విశేష పూజలు చేపట్టారు. అనంతరం గ్రామంలో ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కలగ శివానంద్, చందక అశోక్, యలమంచిలి కార్తీక్, శిష్టి సంతోష్, బి.పవన్, బొబ్బర వరహాలరావు, గండ్రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : పెదనాయుడు పాలెం, మలునాయుడుపాలెం, గొటివాడ గ్రామాల్లో భూలోకమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు జరిపారు. మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలను పళ్లేల్లో పేర్చి గ్రామం నుంచి అమ్మవారిగా కొలిచే చెట్టు వరకు మేళ తాళాలు, బాజా భజంత్రీలతో సారెను ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. అక్కడ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోను దేముడమ్మ, నాయుడు, సబ్బవరపు సత్యనారాయణ, బుజ్జి, నాగేంద్ర, గొర్లి శ్రీను, మిడతాన రాములు, గండి అక్కయ్య, దేముడు, పెంటయ్య, సత్తిరాజు తదితరులతో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పెదరామస్వామి ఆలయంలో రుద్రపూజ


రుద్రపూజను భక్తులకు వివరిస్తున్న స్వామిజీ

కొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణం గవరపాలెంలో గల పెదరామస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం రుద్ద రుద్రపూజ నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్, వైదిక ధర్మ సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకకు స్వామి నిర్మలానంద హాజరై ఉమా గౌరీ సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రపూజ చేశారు. తొలుత ఆయనకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆయనకు స్వాగతం పలికారు. శ్రీరామచంద్ర మూర్తిని స్వామిజీ దర్శించుకున్నారు. అనంతరం భగవంతుడు, ఖర్మ సిద్ధాంతం, ఆధ్యాత్మిక అంశాలపై భక్తులకు అభిభాషణ చేశారు.

రామాపురంలో నేత్ర వైద్య పరీక్షలు


కంటి పరీక్ష జరుపుతున్న వైద్యుడు

కొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రామాపురం కాలనీలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విజన్ ట్రీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.భానుకుమార్, పౌర్ణమి హాజరై రోగులను పరీక్షించి పలువురికి మందులు అందజేశారు. కంటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. సాయి మందిర నిర్వాహకులు బీవీపీ మహేశ్వరి, వి.వి.రమణ, సహాయకులు సాయిరాం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి బలవన్మరణం

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శారదానగర్‌లో ఓ యువతి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పట్టణ సీఐ గోవిందరావు ఆదివారం విలేకరులకు అందించిన వివరాలిలా ఉన్నాయి. మెట్టపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు మంగకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురుకు వివాహం జరిగింది. పెద్ద కూతురు దుర్గాదేవి (28) నర్సీపట్నంలోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేసుకుంటూ, శారదానగర్ సత్యసాయిబాబా గుడికి వెళ్లే ఆర్చి రోడ్డులోని డాబా ఇంట్లో అద్దెకు ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం ఇంటి యజమాని సోదరుడు వంకల ప్రసాద్‌కు అందిన సమాచారంతో మేడపైకి వెళ్లి చూడగా, దుర్గాదేవి ఉంటున్న పోర్షన్ గది తలుపు లోపల గడియ పెట్టి ఉంది. కిటికీ తెరిచి చూడగా దుర్గాదేవి ఫ్యాన్‌కి ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే దుర్గాదేవి తల్లికి సమాచారం ఇచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి వచ్చి విచారించారు. ఫిర్యాదులో ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయకపోవడంతో మృతిరాలి ఫోన్ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు చినరాజుపేటలో శూలాల మహోత్సవం

- భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు
- రోజంతా వివిధ కార్యక్రమాలతో సందడి


చినరాజుపేటలో చౌడేశ్వరి సాంబశివుని ఆలయం

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినరాజుపేటలో గల చౌడేశ్వరి సాంబశివుని ఆలయం వద్ద సోమవారం శూలాల మహోత్సవం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఏటా కార్తీకమాసం నాల్గో సోమవారం ఈ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తెల్లవారుజామున చౌడేశ్వరి, సాంబశివులకు ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి వరప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. రాత్రికి ఆలయ పరిసరాల్లో వివిధ దేవతా మూర్తుల ఆకారాల్లో భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణ చేపట్టనున్నామన్నారు. అమ్మవారికి ఏటా మాదిరిగానే ప్రముఖ శిల్పి కామదేను జగదీశ్వర రావు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తున్నామన్నారు. రాత్రికి ఉపవాస దీక్షలు చేసిన భక్తులు శూలాలు ధరించి పురవీధుల్లో ఊరేగింపు జరుపుతారని వివరించారు. రాత్రికి ఆలయ పరిసర ప్రాంతాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.


శూలాలు ధరించిన శివ భక్తుడు (ఫైల్)

నర్సాపురం డ్యామ్ గేటుకు మరమ్మతులు

- కొత్త లాకులు ఏర్పాటు చేసిన సిబ్బంది


డ్యామ్ వద్ద గేటుకు కొత్త లాకులు వేస్తున్న దృశ్యం

కశింకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపురం డ్యామ్‌కు సంబంధించి ఒక గేటు పూర్తిగా పనిచేయక పోవడంతో ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. డ్యామ్ చైర్మన్ ఉప్పులూరి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ పనులను డీఈ ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షించి గేటుకు ఏర్పాటు చేసిన కొత్తలాకులను ఏర్పాటు చేశారు. ఈ డ్యామ్ నుంచి సోమవరం, నూతనగుంటపాలెం, ఏనుగుతుని, జంపపాలెం, సోమలింగపాలెం, ఎలమంచిలి గ్రామీణ ప్రాంతాల శారదా నది గట్టు గుండా నీరు ప్రవహిస్తుందన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి ఎటువంటి ప్రమాదం జరగకుండా గట్లను పరిశీలించి తగిన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. దీనిపై ఆయా గ్రంథాలయాల ప్రజలు అనంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంతిన చిరంజీవి, జెర్రిపోతుల నూకునాయుడు, మలసాల నానాజీ, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం


కవి సమ్మేళనంలో పాల్గొన్న అతిథులు

సబ్బవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం శాఖ గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం ఉత్సాహ భరిత వాతావరణంలో సాగింది. ముందుగా గ్రంథాలయ పితామహుడు డాక్టర్ అయ్యంక వెంకటరమణ, డాక్టర్ రంగనాథ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయుడు బి.నరసింహ మూర్తి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఏర్పాటైంది. అరసాడ సూర్యనారాయణ రావు, టి.తరుపతిస్వామి, కామిరెడ్డి దేముడు తది తరులు చక్కని కవితలను వినిపించారు. ఆసక్తి కలిగించిన సాహిత్యాన్ని ప్రదర్శించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు టి.తిరుపతిస్వామిని సత్కరించారు. గ్రంథాలయాధికారిణి శిరీషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడంతో ఆర్థిక భారం'

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు పని చేయకపోవడం వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల బారిన పడిందని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేయడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించక పోవడం వల్లే సంస్థకు భారం అధికమైందన్నారు. ఇప్పటికైనా ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా కాపాడి, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో ఖండించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల విజేత విశాఖపట్నం

లింగపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల విజేత విశాఖపట్నం జట్లు నిలిచాయని స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో రెండు రోజులుగా జరుగుతున్న అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు గెలిచింది. బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు గెలిచింది.

కొట్టుకుపోయిన రోడ్డు, కల్వర్టు పరిశీలన



మెట్టవలస సమీపంలోని కల్వర్టును పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ, తదితరులు

అనంతగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండంలోని వేంగడ నుంచి నిమ్మలపాడు మార్గంలో మొంథా తుఫాన్‌కు పలుచోట్ల రోడ్డంతా కోతకు గురికావడంపై గ్రామస్థులు పాడేరు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు. ఆదివారం పీఆర్ ఏఈ సాంబశివరావు, గ్రామస్థులతో కలిసి ఈ రోడ్డును పరిశీలించారు. అక్కడ నుంచి వేంగడ మెయిన్‌రోడ్డు బంధవలస మెట్టపాడు సమీపంలో కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలించారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

మినీ కళా మందిరం నిర్మాణానికి శంకుస్థాపన



సీతగుంటలో భూమి పూజ చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు తదితరులు

పెదబయలు, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతగుంట గ్రామంలో భీమలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో జిల్లా పరిషత్ నిధులతో మినీ కళామందిరం నిర్మాణానికి ఆదివారం స్థానిక జడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చొరవతో జడ్పీ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ మినీ కళామందిరం నిర్మాణం జరిగితే భక్తులకు సదుపాయంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, నాయకుడు గంపరాయి సూరయ్య, శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప సేవా పీఠం ప్రధానగురుస్వామి, అర్చకులు శ్రీనివాస శర్మ, పాంగి సింహాచలం, రూడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీ సమస్యలను విస్మరించిన ఒడిశా సీఎం'



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు లోకనాథం

అరకులోయ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడేరులో జరిగిన ఆదివాసీ యోధుడు బిర్సా ముండా జయంతి సభలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ ప్రసంగంలో ఆదివాసీ సమస్యలను పూర్తిగా విస్మరించడం సముచితం కాదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం విమర్శించారు. ఆదివారం స్థానిక గిరిజనసంఘ కార్యాలయంలో కార్యదర్శి అప్పలనర్సతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. బిర్సాముండా శతజయంతిని రాజకీయ ప్రయోజనాలకోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటు అన్నారు ఒడిశా సీఎం ఏవోబీ సరిహద్దు సమస్యలు , కొటియా గ్రామ గిరిజనుల ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావించకపోవడం విచారకరమన్నారు. మంత్రి సంధ్యారాణి అభ్యర్ధనలను కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్రలోని మోదీ ప్రభుత్వం అటవీహక్కుల చట్టాన్ని సవరణచేసి బలహీనం చేస్తోందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అటవీ భూములను ధారదత్తం చేస్తున్నట్టు ఆరోపించారు. బిర్సాముండా ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.రామారావు పాల్గొన్నారు.

నేడు తాజంగి దొంతులమ్మ కొండపై ఆగమనం



అమ్మవారు

చింతపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి దొంతులమ్మ కొండపైన సోమవారం ఆగమనం (ఆధ్యాత్మిక కార్యక్రమం) నిర్వహించనున్నట్టు పూజారి గణపతి తెలిపారు. అమ్మవారం ఆలయంలో ఈ కార్యక్రమానికి ఇస్కాన్ మాయపూర్ అధ్యక్షులు, ఇస్కాన్ ఇండియా ట్రైబల్ కేర్ ట్రస్టు చైర్మన్ పురుషోత్తమ స్వామి హాజరు కానున్నారన్నారు.

ఇల్లు మంజూరు చేయాలి



ఇంటి కోసం ఎదురు చూస్తున్న బొంజుబాబు

జి.మాడుగుల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్నా ప్రభుత్వపరంగా తనకు ఇల్లు మంజూరు కాలేదని గెమ్మెలి పంచాయతీ ఎగువకూనేటి గ్రామానికి చెందిన పాంగి బొంజుబాబు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామంలో నివాసం ఉంటున్న 32 మంది గిరిజన కుటుంబాలకు గృహ నిర్మాణ పథకం వర్తించదని, తన కుటుంబానికి కేటాయించలేదని వాపోయాడు. అధికారులు స్పందించి ఇంటిని మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దారెలలో చిన్నారుల మృత్యుఘోష

» నెల రోజుల వ్యవధిలో ఐదుగురి మృతి

» తల్లిదండ్రులకు పుట్టెడు శోకం.. గ్రామాల్లో భయాందోళన



భయాందోళనలో డి.కుమ్మరిపుట్టు గిరిజనులు

ముంచంగిపుట్టు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారెల పంచాయతీని వరుస శిశు మరణాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కేవలం నెల రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. డి.కుమ్మరిపుట్టు గ్రామంలో శనివారం నాలుగు నెలల హర్షశ్రీ అనే బాబు మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన లలితశ్రీ అనే నాలుగు నెలల చిన్నారి ఈ నెల 11 తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. పంచాయతీ పరిధి చీవుకుచింతలో రెండు నెలల బాబు, తలింబ గ్రామంలో రెండు నెలల చిన్నారి, నెల రోజుల బాబు ఇలా వరుసగా మృత్యువాత పడడంతో ఈ ప్రాంతీయులు ఆందోళన చెందుతున్నారు.

ఐదు నెలలకే పాప దూరమైంది...



తమకు మొదటి కాన్పులో పాపపుట్టింది. లలితశ్రీ నామకరణం చేశాం. పాప ఎక్కువగా ఏడవడం, తల్లిపాలు తాగకపోవడంతో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా అక్కడ వైద్య సేవలందించారు. మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్య సేవలు పొందుతూ పాప మృతి చెందింది. పాప కనీసం ఐదు నెలలు నిండకుండానే మృతి చెందడం, మా ఆశలు ఆవిరైపోయాయి.

- పి.కామరాజు, ఈశ్వరి దంపతులు, డి.కుమ్మరిపుట్టు

ఆదివారం బాధిత గ్రామాలను సందర్శించిన స్థానిక పాత్రికేయులు ఎదుట బాధిత తల్లిదండ్రులు శిశు మరణాలను వివరిస్తూ బోరున విలపించారు. కారణాలు తెలియని వ్యాధులతో తమ పిల్లల ప్రాణాలు పోతున్నాయని వాపోయారు. శిశు మరణాలు జరగకుండా వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు.

శిశు మరణాలపై విచారణ : డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్

దారెల పంచాయతీ పరిధిలో జరిగిన శిశు మరణాలపై విచారణ నిర్వహిస్తున్నాం. ఆదివారం ఆయా గ్రామాల్లో చిన్న పిల్లల వైద్యులతో కూడిన రెండు బృందాలు మరణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. బాధిత శిశువుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారు. సోమవారం శిశు మరణాలపై పూర్తి వివరాలు తెలియజేస్తాం.

ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధిగా పత్రికలు

» ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్



మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్

చింతపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా దినపత్రికలు పనిచేస్తున్నాయని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ (సీఆర్ మీడియా) ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకుని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్, ఏపీయూడబ్ల్యూజే పాత్రికేయులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కచ్చితమైన సమాచారాన్ని నిర్భయంగా అందించడం ప్రతికల విధి అని అన్నారు. దృఢమైన ప్రజాస్వామ్యానికి న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థ, పత్రికా రంగాన్ని నాలుగు స్తంభాలుగా పరిగణిస్తాయన్నారు. ఒక దేశంలో పత్రికలకు ఉన్న స్వేచ్ఛ ఆధారంగా అందులోని పౌరుల స్థితిగతులను తెలుసుకోవచ్చునన్నారు. పత్రికలు సమాచారంతోపాటు ప్రజలకు అదనంగా విజ్ఞానం, వినోదాన్ని అందిస్తున్నాయన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడడంలో పత్రికలు ప్రధాన భూమిక పోషించాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ ప్రధాన కార్యదర్శి డి. సోమసుందర్, సీఐ ఎం. వినోద్‌బాబు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌బీఎల్ స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.నాగరాజు, చింతపల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు వీజే దయానంద్, ప్రింట్ మీడియా అధ్యక్షుడు దేశెట్టి సతీశ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఎస్.వనరాజు, ఏపీఈఎంజేఏ రాష్ట్ర కార్యదర్శి చింతల కిశోర్ పాల్గొన్నారు.

నేర వార్తలు రాసే సమయంలో మెలకువలు పాటించాలి: సీఐ

నేర వార్తలు రాసే జర్నలిస్టులు ప్రత్యేక మెలకువలు పాటించాలని స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ ప్రెస్ అకాడమీ(సీఆర్ మీడియా) చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. రెండో రోజు గిరిజన చట్టాలు, రిపోర్టింగ్‌పై సీనియర్ జర్నలిస్టు గంజివరపు శ్రీనివాసరావు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై సీనియర్ జర్నలిస్టు కుర్రా విజయ్ కుమార్, ప్రతికా భాషపై సంపాదకులు ఆర్వీ రామారావు బోధించారు. శిక్షణ పూర్తి చేసుకున్న పాత్రికేయులకుధ్రువపత్రాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ముగింపు సభలో సీఐ మాట్లాడుతూ జర్నలిస్టులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా నేర వార్తలు రాసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనర్ నిందితులు, అత్యాచార బాధితుల వివరాలు, చిత్రాలు ప్రచురించరాదన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పాత్రికేయుల కోసం దూర విద్య ద్వారా జర్నలిజం సర్టిఫికేట్, డిప్లొమోకోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఏజెన్సీలో విలేకరులకు ఇళ్ల స్థలాలు మంజూరుపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు.

'స్థానిక సంస్థల్లో గెలుపే ధ్యేయం కావాలి'



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిదులు

కొయ్యూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేసేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాకురు చంద్రరావు పేర్కొన్నారు. ఆదివారం వలసంపేటలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 33 పంచాయతీ సర్పంచ్‌లతో పాటు 14 ఎంపీటీసీలు, జడ్పీటీసీ పార్టీ కైవసం చేసుకోవాలనే దృఢ సంకల్పంతో నాయకులు ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లో ప్రచారం చేయాలని కోరారు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతీసే విధంగా ఏ ఒక్కరు ప్రవర్తించినా సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత, జడ్పీటీసీ మాజీ సభ్యు డు శ్రీరామూర్తి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ డి. చిట్టిబాబు, అనిశెట్టి చిరంజీవి, కొర్రు రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

దారెల పంచాయతీలో ప్రత్యేక వైద్య శిబిరాలు

» శిశు మరణాలపై వివరాల సేకరణ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ముంచంగిపుట్టు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారెల పంచాయతీ పరిధిలో వరుసగా శిశువులు మృతి చెందిన డి.కుమ్మరిపుట్టు, తలింబ, చీవుకుచింత గ్రామాల్లో ఆదివారం వైద్య శాఖ ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది. పంచాయతీ పరిధిలో నెల రోజుల వ్యవధిలో ఐదుగురు శిశువులు మృత్యువాత పడిన విషయంపై పత్రికల్లో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే.ఈ స్థితిలో ఆదివారం గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులందించారు. శిశు మరణాలపై తల్లిదండ్రులు, ఆయా గ్రామాల గిరిజనులతో మాట్లాడి వివరాలను సేకరించారు. మృతి చెందిన శిశువులు పుట్టిన నుంచి వారి ఆరోగ్య పరిస్థితి, వారికి అందిన వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ మృతులపై విచారణ చేపట్టామని, ఉన్నతస్థాయిఅధికారులకు నివేదిక అందించనున్నట్టు జిల్లా టీకాల అధికారిణి కమల కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్బూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యాంప్రసాద్, కిలగాడ సీహెచ్‌వో సౌరప్పడు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్వర బాధితుడుని డోలీలో ఆస్పత్రికి తరలింపు



జ్వరబాధితుడుని డోలీలో తరలిస్తున్న గిరిజనులు

చింతపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజలిశనివారం పంచాయతీ తాటిబంద గ్రామానికి చెందిన గిరిజన జ్వరబాధితుడిని ప్రధాన రహదారి వరకు డోలీలో మోసుకువచ్చిఆస్పత్రికి తరలించారు. తాటిబందకు చెందిన మర్రి కొండబాబు ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వ్యాధి తీవ్రం కావడంతో నడవలేని స్థితికి చేరాడు. బాధితుడిని ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు 108కి కాల్ చేశారు. గ్రామానికి రహదారిలేకపోవడంతో నాలుగు కిలోమీటర్ల దూరంలో అంబులెన్సు నిలిచిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు డోలీలో ప్రధాన రహదారి వరకు గిరిజనులు అతనిని మోసుకొచ్చారు. అక్కడ నుంచి అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది ఎస్.రాజు, షేక్ రెహమాన్ అంబులెన్సులో ప్రాథమిక చికిత్స అందించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అద్దరవీధిలో ఆరు నెలల శిశువు మృతి

» వరుస మరణాలతో గ్రామస్థుల ఆందోళన



ఆకస్మికంగా వాంతు చేసుకుని మృతి చెందిన చిన్నారి (ఫైల్)

గూడెంకొత్తవీధి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దరవీధి గ్రామంలో వరుసగా శిశు మరణాలు సంభవిస్తుండడంతో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల వ్యవధిలో ఇద్దరు శిశువులు మృత్యువాత పడగా, ఆదివారం ఉదయం మరో ఆరు నెలల మగ శిశువు మృతి చెందాడు. స్థానికులు, బాధితుల కథనం... గత నెలలో జర్త ధారబాబు, సరస్వతి దంపతుల నాలుగు నెలల పాప, 20 రోజుల క్రితం మండిబి వరలక్ష్మికి చెందిన ఐదు నెలల పాప వాంతులు చేసుకుని వెనువెంటనే మృతి చెందారు. ఆదివారం మొట్టడం అనిల్ కుమార్, దేవి దంపతుల ఆరు నెలల శిశువు ఆకస్మికంగా ఉదయం ఇదే రీతిలో వాంతు చేసుకుని నిమిషాల వ్యవధిలోనే మరణించాడు. గ్రామంలో వరుసగా శిశువులు మృతి చెందుతున్నా వైద్య సిబ్బంది వచ్చిన దాఖలాలులేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా శిశు మరణాలకు కారణాలను అధికారులు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

పాడేరురూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని పూర్ణ పుష్కల అయ్యప్ప స్వామి ఆలయంలోని రమా సహిత సత్యనారాయణ స్వామికి సామూహిక వ్రతాలు ఆదివారం నిర్వహించినట్టు ఆలయ ధర్మకర్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని నిర్వహించినతఈ వ్రతాల్లో 25 కుటుంబాలకు చెందిన జంటలతో పాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.అర్చకులు ప్రవాణ్ శర్మ భక్తులతో వ్రతాన్ని చేపట్టారు.ఆలయ కమిటీ ప్రతినిధులు రొబ్బి రాము, ఆదిత్య, దామో, సత్తిబాబు, వర్మసత్తిబాబు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి వైద్య ఉద్యోగుల సమస్యలు



వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

పాడేరురూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బిర్సా ముండా జయంతి సందర్భంగా ప్రభుత్వం ఆదివారం పాడేరులో నిర్వహించిన గిరిజన గౌరవ ఉత్సవానికి హాజరైన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను వైద్య ఆరోగ్య శాఖ గిరి ఉద్యోగుల సంఘం నాయకులు కె.లక్ష్మణరావు, మమ్ముట్టి కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు గత పదేళ్లుగా మారుమూల గ్రామాల్లో ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న పారా మెడికల్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, శత శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ త్వరలోనే ఉద్యోగులకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వనున్నట్టు హామీ ఇచ్చారు.

సెల్ టవర్ నిర్మించారు.. ప్రారంభం మరిచారు

జి.మాడుగుల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీరం పంచాయతీ వేమరాజు కోడాపల్లిలో నిర్మించిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) టవర్ ప్రారంభానికి నోచుకోలేదు. ఏ డాది కిందట యుద్ధ ప్రాతిపదిక సెల్ టవర్ పూర్తి చేశారు. కానీ, నేటి వరకు సేవలు ప్రారంభించక పోవడంతో స్థానికులువిస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనితో పాటు నిర్మాణాలు చేపట్టిన టవర్లను ప్రారంభమై సేవలందిస్తున్నారరు. తమ గ్రామంలోని టవర్ ప్రారంభించడం గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అలంకార ప్రాయంగా వి.కోడాపల్లి సెల్‌టవర్ →



ఒడిశా ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



ఒడిశా సీఎం మోహన్ చరణ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ దినేశ్‌కుమార్, పీవో శ్రీపూజ

పాడేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ యోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆదివారం ఇక్కడికి వచ్చిన ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో శ్రీపూజ, డీఐజీ గోపినాథ్‌జెట్టి, ఎస్పీ అమిత్‌బర్ధార్, జిల్లా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు హెలీప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ బుజ్జిరెడ్డి, బీజేపీ నేతలు పాంగి రాజారావు, శాంతకుమారి, కూడ కృష్ణారావు, పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఒడిశా సీఎం రావడం ఆనందదాయకం'

పాడేరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా విగ్రహావిష్కరణకు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జి హాజరు కావడం ఆనందదాయకమని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేశ్‌కుమార్ అన్నారు. పాడేరు మండలం చింతలవీధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బిర్సా ముండా కాంస్య విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా ఒడిశా సీఎం పాల్గొవడం ఇరు రాష్ట్రాల స్నేహసంబంధాలు మెరుగుకు దోహదపడతాదన్నారు.డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోఅభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం పరుగు పెడుతుందన్నారు.

ముమ్మరంగా వరి కోతలు



పంటను కోస్తున్న గిరిమహిళలు

అరకులోయ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరి గ్రామాల్లో వరి పంట కోత పనుల్లో గిరిజనులు బిజీబిజీగా ఉన్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడితే ఈ ఏడాది కష్టపడిన పంట నష్టపోతామనే భయంతో చేలను కోతలు, కుప్పలు పెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. పనలను కట్టలు కట్టి కళ్లాలకు తరలిస్తున్నారు. కొందరు నూర్పులు పూర్తి చేస్తుండగా, మరికొంతమంది కుప్పలు పెడుతున్నారు. యంత్రాలతో నూర్పులు పూర్తి చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో వరిపంట దిగుబడి ఆశాజనకంగా రావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ప్రకృతి ఒడిలో బాల్యం

» ఆదివాసీ చిన్నారులు ఆటవిడుపు



గడ్డివాము పందిరకు కట్టిన ఊయల్లో చిన్నారులు

ముంచంగిపుట్టు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లలు అవకాశం దొరికితే చాలు సెల్‌ఫోన్లలో మునిగిపోవడం సర్వసాధారణం. కానీ, ఆదివాసీ చిన్నారులు ఇందుకు భిన్నంగా గడుపుతున్నారు. మండలం లోని దారెల పంచాయతీ మారుమూల కోడాపుట్టు గ్రామంలో ఆదివారం చిన్నారులు ప్రకృతి ఒడిలో సేదతీరుతూ ఆటపాటలతో సంతోషంగా కనిపించారు. ఎండుగడ్డి భద్రపరిచే పందిరికి కట్టిన సాదాసీదా ఉయ్యాలలు వారి ఆనందానికి కేంద్రబిందువయ్యాయి. రోజంతా ఆ ఉయ్యాలలు ఊగుతూ, కేరింతలతో స్వచ్ఛమైన ఆనందాన్ని అనుభవించారు. పెద్దలు ఈ తాత్కాలిక ఉయలలు ఏర్పాటు చేశారు. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

అడ్డులేని గ్రావెల్ మాఫియా

... 5వ పేజీ తరువాయి



అంతకాపల్లిలో ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్వకాలు

అర్ధరాత్రి గ్రావెల్ తవ్వకాలు జరుపుతుండగా అధికారులు దాడి చేస్తున్నారన్న సమాచారంతో అక్రమార్కులు పారిపోయే క్రమంలో ఒక గొర్రెల కాపరని ఎక్సకవేటర్‌తో ఢీకొన్నారు. అనంతరం అధికారులు, రాజకీయ నాయకులు మధ్యవర్తిత్వం చేసి పోలీసు కేసు లేకుండా సెటిల్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. గతంలో గ్రావెల్ తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఒక వీఆర్వోపైకి ఎక్స్‌కవేటర్‌తో దాడికి యత్నించగా, అతను త్రుటిలో తప్పించుకున్నాడు. కానీ ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయ్యింది. స్థానిక నాయకులు మధ్యవర్తిత్వం చేసి వీఆర్వోకు కొత్తబైక్ కొనిచ్చి కేసు లేకుండా చేశారు. అధికార, విపక్ష నేతలు ఒక్కటై గ్రావెల్ దందా సాగిస్తుండడంతో అధికారులు పట్టించుకోవడంలేదు.

గ్రావెల్ వాహనాలతో బీటీ రోడ్లు ధ్వంసం

మండలంలోని గంగవరం, నంగినారపాడు గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రతిఫలంగా వీఎంఆర్‌డీఏ అధికారులు కొన్ని ప్లాట్లు ఇచ్చారు. ఈ లేఅవుట్లలో తొలుత గ్రావెల్ రోడ్లు, అనంతరం బీటీ రోడ్లు వేశారు. గ్రావెల్ తరలించే వాహనాలు ఈ రోడ్ల మీదుగా వెళుతుండడంతో ఛిద్రమవుతున్నాయి. వీఎంఆర్‌డీఏ అధికారులు సైతం పట్టించుకోవడంలేదు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తులో పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కఠినంగా అమలు చేయాలని, వాహనచోదకులు సీటు బెల్ట్/ హెల్మెట్ వాడకం నిబంధలను కచ్చితంగా పాటించేలా చూడాలన్నారు. వివిధ రూట్లలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ మండలం మీదుగా గంజాయి రవాణాను పూర్తిగా కట్టడి చేయాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు వీటి బారిన పడకుండా వుండేందుకు గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, మహిళా చట్టాలు, హెల్ప్‌లైన్ వినియోగంపై గ్రామాల్లో ప్రచారం చేయాలని అన్నారు. డీఐజీ వెంట ఎస్‌ఐలు ఎ.శ్రీనివాసరావు, రఘువర్మ, నారాయణరావు, పోలీసు సిబ్బంది వున్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

కార్తీక మాసానికి మహిళల ప్రాధాన్యం

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు కార్తీక మాసానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో ఆదివారం దేవాంగులు నిర్వహించిన వన సమారాధనలో స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండి వ్రతాలు, పూజలు చేయడం అభినందనీయమన్నాడు. కార్తీక మాసం అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. పిల్లలను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచి బాగా చదివించాలని స్పీకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నెహ్రూ, శంకర్ గంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పునర్నిర్మించాలని ఆదివాసీల నిరసన



అర్థ నగ్నంగా ర్యాలీ చేస్తున్న ఆదివాసీలు

రోలుగుంట/కొయ్యూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో శిథిలమైన అర్ల-పిత్రిగెడ్డ రహదారిని పునర్నిర్మించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నాలుగు గ్రామాల నుంచి తరలివచ్చి నిరసన తెలిపారు. 2020లోనే శ్రమదానంతో మట్టి రోడ్డు నిర్మించుకున్నామని, శాశ్వత రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.4.1 కోట్లు మంజూరు చేసిందని వారు చెప్పారు. ఈ నిధులతో పనులు చేపట్టఆ మొంథా తుఫాన్ కారణంగా రోడ్డు కొట్టుకుపోయిందని తెలిపారు. కనీసం ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి గిరిజనుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, కొర్రా సుబ్బారావు, కొర్రా కొండబాబు, గెమ్మిలి చిన్న, గెమ్మిలి అప్పారావు, కిల్లో కామేశ్, ఆదివాసీలు పాల్గొన్నారు.

మాడుగుల సచివాలయం-3లో డిజిటల్ అసిస్టెంట్ లేక అవస్థలు



ఖాళీగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్ కుర్చీ

మాడుగుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాడుగుల సచివాలయం-3లో డిజిటల్ అసిస్టెంట్ కుర్చీ వారం రోజులుగా ఖాళీగా దర్శనమిస్తున్నది. దీంతో సచివాలయానికి వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వస్తున్న ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి నిరీక్షించి చేసేదిలేక నిరాశతో వెనుతిరుగుతున్నారు. వారానికిపైగా ఈ సమస్యతో అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే వారం క్రితం ఇక్కడ డిజిటల్ అసిస్టెంట్‌ను ఎం.కోటపాడు సచివాలయానికి డిప్యుటేషన్‌పై పంపించారు. ఈ బాధ్యతలను మహిళా పోలీసుకు ఇన్‌చార్జి అప్పగించారు. అయితే సదరు మహిళా పోలీసు ఈ బాధ్యతలు చేపట్టలేనని చెప్పినట్టు సమాచారం. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న డీజీనాథ్

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ ప్రారంభించారు. కథలు, ఆరోగ్య సూత్రాలతో పాటు వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే అనేక రకాల పుస్తకాలను ప్రదర్శించారు. అనంతరం జూనియర్, సీనియర్ విభాగాల్లో స్టోరీ టెల్లింగ్, క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారిణిదమయంతి తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం



రావణాపల్లిలో గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పొలాల్లో వరిదుబ్బును తీసుకువచ్చి గౌరీపరమేశ్వరుల వద్ద ఉంచారు. అలాగే పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఉరేగించారు. అనంతరం రామాలయంలో గౌరీపరమేశ్వరులను కొలువు ఉంచారు.

సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు



ఉత్సవాల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

దేవరాపల్లి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సత్యసాయి వాటర్ ప్లాంటు వద్ద శశిభూషణరావు ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సాయి బాబా, హనుమాన్ వేషధారణలతో యువకులు ఆకట్టుకున్నారు. వృద్ధులకు రగ్గులు, గొడుగులు అందించారు. సత్య సాయి సేవా సంస్థల ప్రతినిధులు కె.అప్పలనాయుడు, రవిశంకర్, ఎ.చినకన్నబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

డ్రగ్స్ రహిత రాష్ట్రమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

యువతే దేశానికి భవిత: ఎమ్మెల్యే రాజు

ఉత్సాహంగా పోలీసుల అభ్యుదయ సైకిల్ యాత్ర





డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, అధికారులు

కొత్తకోటలో అభ్యుదయ సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాకు ఎవరూ బానిసలు కావొద్దని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు సూచించారు. విశాఖ రేంజ్ పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అభ్యుదయ సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర మండలంలోని కొత్తకోట చేరుకుంది. ఈ సందర్భంగా సీఐ జి.కోటేశ్వరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఏపీని డగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువతే దేశానికి భవిత అన్నారు. అందువల్ల గంజాయి, మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు సరైన శ్రద్ధ చూపకపోవడంతో, వారు చెడు అలవాట్లకు ఆకర్షితులు అవుతున్నారని ఆయన చెప్పారు. పిల్లలు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని చెప్పారు. పిల్లలు చదువుల పేరుతో ఇంటి నుంచి బయటకువెళ్లి ఎప్పుడు వస్తున్నా తల్లిదండ్రులు ప్రశ్నించలేకపోవడం, సెల్‌ఫోన్లను నియంత్రించకపోవడంతో యువత చెడు మార్గం పడుతున్నదని వాపోయారు. ఈ సందర్భంగా ముత్తుకు బానిసలై, విముక్తి పొందిన బంగారు పవన్‌కుమార్, బుచ్చెయ్యపేట మండలం ఆర్.శివరాంపురానికి చెందిన యువకుడు తండ్రి అప్పలనాయుడును వేదికపై అందరికీ పరిచయం చేశారు. గంజాయి, మత్తుకు అలవాటు పడినప్పుడు పడే ఇబ్బందులను అందరికీ తెలియజేశారు. అలాగే మత్తు పదార్థాల వల్ల కలిగే చెడు ప్రభావాలను సీఐ వివరించారు.

అనంతరం డ్రగ్స్ నియంత్రణపై కోలాటాలు, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కొత్తకోట నుంచి ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర రావికమతం మీదుగా ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండనాయుడు, నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, టీడీపీ సీనియర్ నాయకులు కోట గోవిందరావు, ఉగ్గిన శ్రీను, కోట సత్యనారాయణ, వెల్లంకి ఈశ్వరావు, తహశీల్దార్ అంబేడ్కర్, ఎంఈవో బ్రహ్మాజీ, కొత్తకోట, రావికమతం, రోలుగుంట, బుచ్చియ్యపేట, చోడవరం ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేయిస్తా..

▸▸ ఆమ్‌ఆద్మీ నేతలకు ఎమ్మెల్యే రాజు హామీ

▸▸ 21 రోజుల తర్వాత దీక్షల విరమణ



ఆమ్‌ఆద్మీ నేతలకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా తయారైన బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేయించే బాధ్యత తాను తీసుకుంటానని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హామీ ఇచ్చారు. దీంతో బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలంటూ ఆమ్‌ఆద్మీ నేతలు చేపట్టిన నిరాహార దీక్షలు ఆదివారం విరమించారు. బీఎన్ రోడ్డు పనులు చేపట్టి ప్రజల కష్టాలు తీర్చాలంటూ ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు 21 రోజులుగా ప్రధాన రహదారి పక్కన నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే ఆదివారం సాయంత్రం టీడీపీ నేతలతో కలిసి నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించారు. దీక్ష చేస్తున్న ఆమ్‌ఆద్మీ జిల్లా నాయకులు కొణతాల హరినాథ్ బాబు తదితరులతో మాట్లాడారు. బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేయించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఈ పనులు పూర్తి చేయించి ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజు భరోసా ఇచ్చారు. ఈ మేరకు దీక్ష విరమిస్తున్నట్టు ఆమ్‌ఆద్మీ నాయకులు ప్రకటించారు.

నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు ఎమ్మెల్యే రాజు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ దీక్షా శిబిరంలో ఆమ్‌ఆద్మీ రాష్ట్ర నేత శీర రమేశ్, విశాఖ, విజయనగరం జిల్లా నాయకులు వేగి మహలక్ష్మినాయుడు, బీవీఆర్ పవన్‌కుమార్, . నారాయణరావు, పీవీఆర్ మూర్తి, జె.ఉమామహేశ్వరరావు, సనతుల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో పర్యాటకుల సందడి



అల్లూరి పార్కులో సందడి చేస్తున్న పర్యాటకులు

కృష్ణాదేవిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. అనకాపల్లి, అల్లూరి, విశాఖపట్నం జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు పార్కుకు తరలివచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులను సందర్శించి నివాళులర్పించారు. ఇక్కడ అందాలను పర్యాటకులు తిలకించి పులకించిపోయారు. అలాగే ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం పెద్దలు, చిన్నారులు, యువకులు వన భోజనాలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే పార్కులో తాగునీటి సమస్య తీర్చాలని పర్యాటకులు కోరుతున్నారు.

ధారమఠంలో...

గొలుగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధారమఠం శివాలయం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పాతమల్లంపేటలోని ధారమల్లేశ్వరస్వామి ఆలయానికి వివిధ గ్రామాలకు చెందిన పర్యాటకులు, భక్తులు తరలివచ్చారు. ధారమఠంలో నిత్యం జలజలపారే జలపాతమంలో స్నానాలు చేశారు. అనంతరం ఇక్కడే వన భోజనాలు చేసి, శివాలయం వద్ద ఆనందంగా గడిపారు.

మార్కెట్ కమిటీ ఆదాయం పెంపునకు చర్యలు

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాలకవర్గానికి సూచించారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాలకవర్గ తొలి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ విభజన వల్ల తగ్గిపోయిన ఆదాయం పెరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఛైర్‌పర్సన్ అల్లం మాధవి మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో నిర్మించిన రెండు వేల మెట్రిక్ టన్నుల గోదామును అద్దెకు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఇందుకు పాలకవర్గం అనుమతిని ఆమోదించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ గొర్లె సాంబశివరావు, నాయకుడు అల్లం రామప్పారావు, కార్యదర్శి బంగార్రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన ఆర్థికసాయం చెక్కులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 14 మంది లబ్దిదారులకు రూ.8.75 లక్షల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, సీనియర్ నాయకులు కొట్టాపు చిన్న, సేనాపతి శ్రీనివాసరావు, మజ్జి గౌరీశంకర్, సకురు కోటేశ్వరరావు, దేవర రవికుమార్, జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, కర్రి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5.66 లక్షల విలువైన చెక్కులను ఆదివారం చోడవరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజు పంపిణీ చేశారు. కొత్తకోటకు చెందిన పెంటపాటి రాజేశ్వరికి రూ.81,000, నెల్లూరి సుహాసినికి రూ.23,920, టి.అర్జాపురానికి చెందిన సాగరపు సరస్వతికి 62,878, రావికమతానికి చెందిన గంజి గౌరునాయుడుకు రూ.25 వేలు, గుమ్మాళ్లపాడుకు చెందిన బంటు రామునాయుడుకు రూ.35 వేలు, మరుపాకకు చెందిన ఆకుల లక్ష్మికి రూ.25 వేలు, గుడివాడకు చెందిన వీసం కాంతమ్మ రూ.70 వేలు, గొంప గ్రామానికి చెందిన కలగ సత్యవతి రూ.23,920, తోటకూరపాలెంకు చెందిన యడ్ల రాజులమ్మ రూ.49,665, తోటకూరపాలెంకు చెందిన రుత్తల నూకరాజు రూ.1,70,312, మొత్తం రూ.5 లక్షల 66 వేల 695 చెక్కులను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండనాయుడు, ఐటీడీపీ అధ్యక్షుడు గల్లా నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

రోలుగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోలుగుంట శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగానే గ్రంథాలయాదికారి ఎన్.రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఈ పోటీలను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను విద్యార్థులు విజయవంతం చేయాలని వారు కోరారు.

బీజేపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



ఎం.అలమండలో బీజేపీ కండువాలతో కార్యకర్తలు

దేవరాపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండ గ్రామంలో వైసీపీ నుంచి కొంత మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. రాష్ట్ర బీజేపీ మీడియా ప్రతినిధి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఈర్లె శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల అధ్యక్షురాలు అవుగడ్డ సత్యవేణి ఆధ్వర్యంలో వారంతా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఫీల్డ్ మేనేజర్ సూరెడ్డి గోవింద, గూనూరు గోవింద, ఎర్ర నరసింహమూర్తి, కింతాడ ఎర్నికుమార్, శివ, తదితరులకు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రైతులకు ఎల్ల వేళలా సహకార సంఘ సేవలు

దేవరాపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు సహకార సంఘం సేవలు ఎల్ల వేళలా ఉంటాయని సంఘం ఛైర్‌పర్సన్ పూడి సత్యారావు తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయం ఎదుట ఏడు రంగుల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా దేవరాపల్లిలో ఉత్సవాలు జరిగాయన్నారు. సంఘాన్ని మరింత పటిష్ఠం చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. గొంతిన నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి బలవన్మరణం



దుర్గాదేవి (ఫైల్)

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శారదానగర్‌లో ఓ యువతి ఫ్యాన్‌కు ఊరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పట్టణ సీఐ గోవిందరావు ఆదివారం విలేకరులకు అందించిన వివరాలిలా ఉన్నాయి. మెట్టపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు మంగకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురుకు వివాహం జరిగింది. పెద్ద కూతురు దుర్గాదేవి (28) నర్సీపట్నంలోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేసుకుంటూ, శారదానగర్ సత్యసాయిబాబా గుడికి వెళ్లే ఆర్చి రోడ్డులోని డాబా ఇంట్లో అద్దెకు ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం ఇంటి యజమాని సోదరుడు వంకల ప్రసాద్‌కు అందిన సమాచారంతో మేడపైకి వెళ్లి చూడగా, దుర్గాదేవి ఉంటున్న పోర్షన్ గది తలుపు లోపల గడియ పెట్టి ఉంది. కిటికీ తెరిచి చూడగా దుర్గాదేవి ఫ్యాన్‌కి ఊరి వేసుకుని కనిపించింది. వెంటనే దుర్గాదేవి తల్లికి సమాచారం ఇచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి వచ్చి విచారించారు. ఫిర్యాదులో ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయకపోవడంతో మృతిరాలి ఫోన్ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెర్లోపాలెంలో ముగ్గురు జూదరుల అరెస్టు

నాతవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెర్లోపాలెం గ్రామ సమీపంలో చిత్తుల ఆట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మరో నలుగురు వ్యక్తులు పరారీ కావడంతో, వారి మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. అనంతరం చెర్లోపాలెం గ్రామంలో సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో నూతన చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువెళ్తే రివార్డు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్.బాబులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

బుచ్చెయ్యపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వడ్డాది కొత్తూరులో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన పద్మనాభ సీతారామ ఆలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అఖిలపక్షం నాయకులు తెలిపారు. వేద పండితుల అధ్వర్యంలో పద్మనాభ సీతారామ ఆలయం, గణపతి ఆలయం, మహలక్ష్మి దేవి ఆలయంలో శిఖర యంత్ర ఆలయ ప్రారంభోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించేందుకు అఖిలపక్షం అధ్వర్యంలో తీర్మానించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 26 నుంచి 28వ తేదీ వరకు భారీ ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వడ్డాది కొత్తూరులో స్టేట్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, నాయకులు నారాయణమూర్తి, సన్యాసిరావు, దొండా నరేశ్, దాడి గోవింద, సయ్యపురెడ్డి సత్యనారాయణ హాజరయ్యారు.

జాతీయ పత్రికా దినోత్సవం

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెదబొడ్డేపల్లి నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థాపనను పురస్కరించుకొని దేశంలో పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవడానికి జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించుకోవడం, ప్రతి ఏటా వివిధ సేవాల కార్యక్రమాలు చేపట్టడం జరుగుందని ప్రెస్ క్లబ్ సెక్రటరీ చినబాబు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రామకృష్ణ, శివసత్యనారాయణ, మణి, వి.రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యమాలకు స్ఫూర్తి అల్లూరి

కృష్ణాదేవిపేట, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలకు స్ఫూర్తి విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సోమసుందర్ కొనియాడారు. స్థానిక అల్లూరి సీతారామరాజు పార్కును ఆదివారం ఆయన సందర్శించారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పాత్రికేయులతో కలిసి పార్కులో మొక్కలను నాటారు. అనంతరం అల్లూరి, గంటందొర సమాధులకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాత్రికేయులు సమాజ అభివృద్ధి కోసం ప్రజల్లో చైతన్య కలిగించే కథనాలు రాయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు అంబటి వరహాలరాజు, కె.శ్రీను, ఎ.దుర్గాప్రసాద్, పాత్రికేయులు నాగేశ్వరరావు, అప్పలరాజు, లక్ష్మణ్, అన్వేశ్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి భూమి పూజ

గొలుగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటిగైరంపేట గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధికి ఆదివారం భూమి పూజ చేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో ఈ అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు నల్లబెల్లి స్వామి, నల్లబెల్లి రాజబాబు, నందిపల్లి వెంకటరమణ తదితరులు భూమి పూజ కార్యక్రమం చేపట్టారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల విజేత విశాఖపట్నం

లింగపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల విజేత విశాఖపట్నం జట్టు నిలిచాయని స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో రెండు రోజులుగా జరుగుతున్న అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు గెలిచింది. బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు గెలిచింది. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ట్రోఫీలు, బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు

ప్రయాణికులు పరిమితి మించితే చర్యలు

దేవరాపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిమితి మించి ఆటోల్లో ప్రయాణికులను తీసుకు వెళ్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో 20 నుంచి 30 మందిని ఎక్కించడం మంచిది కాదన్నారు. ప్రమాదాలు జరిగితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ విషయంలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు.